క్లుప్తంగా

కార్మికులకు వైద్య పరీక్షలు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని రెండవ వార్డులో స్థానిక కౌన్సిలర్‌ ఆధ్వర్యంలో మే డేను పురస్కరించుకొని భవన నిర్మాణ కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వైద్యులు ముకేష్‌, సంజీవ్‌లు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కౌన్సిలర్‌ సంగీత, ఆర్మూర్‌ మండల కార్మికశాఖ అధికారి మనోహర్‌, సీనియర్‌ అసిస్టెంట్‌ శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం

మాక్లూర్‌: మాణిక్‌భండార్‌లో బుధవారం స్థానిక కార్పొరేటర్‌ మాలావత్‌ రాయ్‌సింగ్‌ కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. మండల వైద్యాధికారి సరిత ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో మూడు రోజుల పాటు శిబిరం కొనసాగుతుందని ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్‌ సూచించారు.

సేవారత్న పురస్కారం

మోర్తాడ్‌: సమాజ సేవతో పాటు సాహితీ సేవలో తరిస్తున్న పోతు రాజారాంను సేవారత్న పురస్కారంతో రవీంద్ర భారతిలో సత్కరించారు. ముంబైలో స్థిరపడిన ఏర్గట్ల వాసి పోతు రాజారాంను తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, కవన కిరణాలు తెలుగు సాహితీ సమాఖ్య 4వ వార్షికోత్సవం మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా పోతు రాజారాం చేస్తున్న సేవలను గుర్తించి పురస్కారాన్ని ప్రముఖ కవి రచయిత నందిని సిద్ధారెడ్డి అందించారు.

రూ.లక్ష విరాళం

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి స్థానిక దాత కొమ్ముల శేఖర్‌రెడ్డి రూ. లక్ష విరాళంగా అందజేశారు. అనంతరం దాతలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. బద్రి, రాజేష్‌, కిషన్‌, రాజేశ్వర్‌, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

పెర్కిట్‌(ఆర్మూర్‌): రైతు బీమా తరహాలో కల్లు గీత కార్మికులకు బీమా కల్పించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఆలూర్‌ మండల దేగాంలో బుధవారం ఎంపీటీసీ ఉప్పునూతుల శ్రీనివాస్‌ గౌడ్‌ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ గౌడ్‌ మాట్లాడుతూ.. కల్లు గీత కార్మికులకు రూ.5 లక్షల భీమా సౌకర్యం కల్పిస్తూ సీఎం కేసీఆర్‌ నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

నేడు లక్ష్మీనర్సింహస్వామి జన్మదిన వేడుకలు

ఎడపల్లి(బోధన్‌): దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధిగాంచిన ఎడపల్లి మండలం జానకంపేట లక్ష్మీనర్సింహస్వామి జన్మదినోత్సవ వేడుకలు గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి వేణు, ఆలయ కమిటీ చైర్మన్‌ పురం సాయిలు తెలిపారు. ఈ సందర్భంగా సాయంత్రం 5 గంటలకు పల్లకీసేవ, 6 గంటలకు ఊజ్వల సేవలు ఉంటాయన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

రెంజల్‌(బోధన్‌): కందకుర్తి త్రివేణి సంగమ పుష్కరక్షేత్రంలోని సీతారాం ధాం సంత్‌ సేవాశ్రమంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం అంగరంగా వైభవంగా నిర్వహించారు. వైదిక బ్రహ్మణులతో ప్రత్యేక పూజలు, యజ్ఞం, హోమాలు చేయిస్తున్నారు. గత నెల 29 నుంచి సేవాశ్రమంలో నిత్య పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. సీతారాం మహారాజ్‌ భక్తులు అందించిన విరాళాలతో ఆలయ నిర్మాణం పూర్తి చేసి విగ్రహాలు ప్రతిష్ఠించారు. నీలా గ్రామస్తులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సమ్మె నోటీస్‌ అందజేత

కమ్మర్‌పల్లి: గ్రామ పంచాయతీల్లో కారోబార్లుగా, బిల్‌ కలెక్టర్లుగా పని చేస్తున్న పంచాయతీ కార్మికులు బుధవారం ఎంపీడీవోకు సమ్మె నోటీస్‌ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమ సమస్యలను పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు వివరించారు. తమకు ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్‌ చేశారు. యూనియన్‌ అధ్యక్షుడు వెంకటరమణ పాల్గొన్నారు.

ఏపీవోపై చర్యలు తీసుకోవాలని ధర్నా

వర్ని: వన సేవకులకు వేతనాలు చెల్లించాలని ఉపాధి హామీ ఏపీవోని అడిగితే దురుసుగా ప్రవర్తించారని ఆరోపిస్తూ వర్ని ఎంపీడీవో కార్యాలయం ఎదుట పొట్టిగుట్ట తండాకు చెందిన వన సేవకులు ధర్నా నిర్వహించారు. వెంటనే తమకు రావాల్సిన 4 నెలల బకాయిలను చెల్లిస్తూ ఏపీవోపై చర్యలు తీసుకోవాలని వర్ని ఎంపీడీవో బషీరుద్దీన్‌కు వన సేవకులు వినతి పత్రాన్ని అందజేశారు. లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఆహ్వానం

బోధన్‌టౌన్‌(బోధన్‌): శక్కర్‌నగర్‌ కాలనీలోనిని సావిత్రి దేవి ధ్యాన పిరమిడ్‌ కేంద్రంలో ఈ నెల 5న బుద్ధ పౌర్ణిమను ఘనంగా నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమానికి అందరికి ఆత్మీయ ఆహ్వానిస్తున్నామని సావిత్రి దేవి ధ్యాన పిరమిడ్‌ కేంద్రం బోధన్‌ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ధ్యానం చేసే విధానం, లాభాలు తెలియజేస్తామన్నారు.

కాంగ్రెస్‌ను కనుమరుగు చేస్తాం

- బజరంగ్‌దళ్‌ నేతల హెచ్చరిక
- కర్ణాటక కాంగ్రెస్‌ మేనిఫెస్టోలో సంస్థను నిషేధిస్తామనడంపై ఆగ్రహం

ఆర్మూర్‌టౌన్‌: భారత దేశంలో అనేక దేవాలయాలు, గోపురాలు, గోసంతతి కాపాడుతున్న హిందూ సంస్థ బజరంగ్‌దళ్‌ను బ్యాన్‌ చేస్తామని కాంగ్రెస్‌ పార్టీ మేనిఫెస్టోలో పెట్టడం సరికాదని, ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే కాంగ్రెస్‌ పార్టీని దేశం మొత్తంలో హిందువులందరూ కనుమరుగు చేస్తారని బజరంగ్‌దళ్‌ నేతలు హెచ్చరించారు. ఆర్మూర్‌ పట్టణంలోని అంబేడ్కర్‌ చౌరస్తా వద్ద బుధవారం బజరంగ్‌దళ్‌ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కర్ణాటక ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్‌ పార్టీ మేనిఫెస్టోలో బజరంగదళ్‌ బ్యాన్‌ చేస్తామని పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బజ్‌రంగ్‌దళ్‌ నేతలు అన్నారు. ఆర్మూర్‌ నగర కార్యదర్శి కొంగి రవి, ఆర్మూర్‌ నగర ప్రభారీ గాజుల దయానంద్‌, జిల్లా గోరక్ష లక్కీ శ్రీధర్‌, జిల్లా ధర్మచార్య ప్రముఖ్‌ నిఖిల్‌ బొచ్కర్‌ పాల్గొన్నారు.


ఆర్మూర్‌ టౌన్‌: అంబేద్కర్‌చౌరస్తా వద్ద కాంగ్రెస్‌ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బజరంగ్‌దళ్‌ నాయకులు

రుద్రూర్‌: రుద్రూర్‌ మండల కేంద్రంలో భజరంగ్‌దళ్‌ ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్‌ పార్టీ దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్‌ ప్రముఖ్‌ ప్రశాంత్‌ గౌడ్‌, గంగా ప్రసాద్‌, గంగాధర్‌, వెంకటేష్‌ , గణేష్‌, భాస్కర్‌, యశ్వంత్‌, సతీష్‌ పాల్గొన్నారు.


రుద్రూర్‌లో.. బజరంగ్‌దళ్‌ కార్యకర్తలు

కార్మికుల హక్కులు ప్రమాదంలో పడ్డాయ్‌

ఆర్మూర్‌: ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చాక కార్మికుల హక్కులు ప్రమాదంలో పడ్డాయని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూమేశ్వర్‌, దాసు ఆరోపించారు. ఆర్మూర్‌ పట్టణంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాలలో భాగంగా కార్మికుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్‌ యూనియన్‌ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిరువురు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను బహిరంగంగా అమ్మివేస్తోంని ఆవేదన వ్యక్తం చేసారు. దీంతో దేశవ్యాప్తంగా నిరుద్యోగం, అధిక ధరల సమస్య ఉత్పన్నం అవుతోందన్నారు.


మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసు

సీపీఐ జీపు జాతను జయప్రదం చేయాలి

ఆర్మూర్‌: బీజేపీ హఠావో.. దేశ్‌ కో బచావో నినాదంతో గ్రామ గ్రామాన సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపు జాతను విజయవంతం చేయాలని సీపీఐ ఆర్మూర్‌ డివిజన్‌ కార్యదర్శి ఆరేపల్లి సాయిలు బుధవారం పిలుపునిచ్చారు. పార్టీ జాతీయ సమితి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. గురువారం బాల్కొండ నియోజకవర్గంలో శుక్రవారం ఆర్మూర్‌, బోధన్‌ నియోజకవర్గాల్లో జీపు జాతను నిర్వహిస్తామన్నారు.

తైబజార్‌ వేలం పాట

కమ్మర్‌పల్లి: బషీరాబాద్‌ గ్రామపంచాయతీలో బుధవారం తైబజార్‌ వేలం పాట నిర్వహించగా, గ్రామానికి చెందిన కనిగెల కాశీరాం అనే వ్యక్తి రూ.60 వేలకు పాడి వేలంను దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ అశోక్‌, ఉప సర్పంచ్‌ విక్రమ్‌, కార్యదర్శి శ్రీనివాస్‌, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి నైపుణ్యాలపై శిక్షణ

పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మండలం చేపూర్‌ క్షత్రియ ఇంజనీరింగ్‌ కళాశాలలో ఈ నెల 5న కళాశాల, ఐసీఎస్‌ఎస్‌ఆర్‌ హైదరాబాద్‌ వారి ఆధ్వర్యంలో ఒక రోజు కార్యశాల నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్‌ అల్జాపూర్‌ శ్రీనివాస్‌ తెలిపారు. నిపుణులైన ప్రొఫెసర్లతో ఎనలైటిక్స్‌, బిజినెస్‌ ఇంటెలిజెన్స్‌, విజువల్‌ ఎనాలసిస్‌, ఫైనాన్షియల్‌ ఎనలైటిక్స్‌, డిజిటల్‌ మార్కెటింగ్‌ తదితర ఉపాధి నైపుణ్యాల గురించి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

దళారులకు ధాన్యాన్ని విక్రయించి నష్టపోవద్దు


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న భాస్కర్‌ రెడ్డి

వర్ని: రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని డీసీసీబీ చైర్మన్‌ పోచారం భాస్కర్‌ రెడ్డి రైతులకు సూచించారు. బుధవారం కోకలదాస్‌ తండాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతుల శ్రేయస్సు కోసం రాష్ట్ర ప్రభుత్వం వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, పండించిన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి లబ్ధి పొందాలని సూచించారు. వర్ని జెడ్పీటీసీ హరిదాసు, నాయకులు గిరి, గోపాల్‌, కరీం తదితరులు పాల్గొన్నారు.

నిలువు దోపిడీ చేస్తున్న రైస్‌ మిల్లర్లు


కోటగిరిలో మాట్లాడుతున్న కాసుల బాలరాజ్‌

రుద్రూర్‌: రైతుల నిస్సహాయతను ఆసరా చేసుకుని రైస్‌ మిల్లర్లు తరుగు పేరిట దోపిడీ చేస్తున్నారని బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి కాసుల బాలరాజ్‌ ఆరోపించారు. కోటగిరి మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు బస్తాకు కిలో చొప్పున తరుగు పేరిట ఇచ్చినప్పటికి, రైస్‌ మిల్లర్లు మళ్లీ తరుగు తీయడమేమిటని ప్రశ్నించారు. తరుగు పేరిట మోసం చేస్తున్న రైస్‌ మిల్లర్‌ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. కాంగ్రెస్‌ నేతలు గంగాధర్‌ దేశాయ్‌, షాహిద్‌, ఎంపీటీసీ కొట్టం మనోహర్‌, మాజీ జెడ్పీటీసీ పుప్పల శంకర్‌ పాల్గొన్నారు.

కొమురం భీం విగ్రహావిష్కరణ



బాల్కొండ: ముప్కాల్‌ మండలం నాగంపేట్‌లో ఆదివాసీ నాయకపోడు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొమురం భీం విగ్రహాన్ని బుధవారం నాయక పోడు సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం శంకర్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొమురాం భీం పోరాటాలను గురించి వివరించారు. పోరాట స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. సర్పంచ్‌ గంగవ్వ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్‌, సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్‌, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణ పనులకు భూమిపూజ


కందకుర్తిలో భూమిపూజ చేస్తున్న సమితి ప్రతినిధులు

రెంజల్‌(బోధన్‌): కందకుర్తిలో కేశవ సేవా సమితి విద్యాలయ నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ నిర్వహించారు. కేశవ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యాలయ నూతన భవన నిర్మాణ పనులను చేపడుతున్నారు. వేద పండితులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా కేశవ సేవా సమితి అధ్యక్షులు చామకూర సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అంకు మహేశ్‌, సర్పంచ్‌ ఖలీంబేగ్‌, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నందిపేట్‌లో అయ్యప్ప ఆలయ నిర్మాణానికి..

నందిపేట్‌ (ఆర్మూర్‌): మండల కేంద్రంలో కేదారీశ్వర ఆశ్రమ ఆవరణలో బుధవారం హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి, కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహారాజ్‌ ఆధ్వర్యంలో అయ్యప్ప ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న హంపి పీఠాధిపతి

నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్‌


పంటలను పరిశీలిస్తున్న నాయకులు

మాక్లూర్‌: అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పీవైఎల్‌ రాష్ట్ర అధ్యక్షుడు దేశెట్టి సాయిరెడ్డి, ఏఐకేఎంఎస్‌ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుడ్డు గంగాధర్‌, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌లు డిమాండ్‌ చేశారు. బుధవారం బోర్గాం(కె), ఒడ్డెట్‌పల్లి గ్రామాలలో పర్యటించి రైతులు ఆరబెట్టిన వరి ధాన్యం కల్లాలతో పాటు పంట పొలాలను పరిశీలించారు. ప్రభుత్వం తక్షణ చర్యగా పంట నష్టం నివేదికలు తయారు చేయించి త్వరగా పరిహారం ఇప్పించాలన్నారు.

ఇంటి నిర్మాణం కోసం రూ.15 లక్షలివ్వాలి


నవీపేటలో జెండా ఎగురవేస్తున్న నేతలు

నవీపేట: అర్హులైన వారందరికీ 58 జీవో ప్రకారం క్రమబద్ధీకరించి ఇంటి నిర్మాణం కోసం రూ.15 లక్షల రుణమివ్వాలని సీపీఎం మండల కార్యదర్శి నాయక్‌వాడి శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం మండల కేంద్రంలో మే డే వార్షికోత్సవాల సందర్భంగా సుందరయ్య కాలనీలో జెండా ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నాయకులు దేవేందర్‌ సింగ్‌, షేక్‌ మహబూబ్‌, రమాదేవి, షమీం, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాల ఇక్కట్లు

- రెండు నెలలుగా చెల్లించని కాంట్రాక్టరు
- పట్టించుకోని వైద్యాధికారులు



బోధన్‌టౌన్‌(బోధన్‌): బోధన్‌లోని జిల్లా ఆస్పత్రిలో పారిశుధ్యం, సెక్యూరిటీ, పేషంట్‌ కేర్‌ విభాగాల్లో పనిచేసే కార్మికులకు 2 నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఆస్పత్రిలో పారిశుధ్యంతో పాటు వివిధ విభాగాల్లో ఔట్‌ సోర్సింగ్‌, కాంట్రాక్టు పద్ధతిలో 42 మంది పనిచేస్తున్నారు. రెండు నెలలుగా వీరికి వేతనాలు రాకపోవడంతో ఇంటి కిరాయలు, నెల సరి సరుకులు కొనుగోలు చేయలేక అవస్థలు పడుతున్నారు. సదరు కాంట్రాక్టరు వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. వేతనాలు ఇప్పించాలని వైద్యాధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది.

కుటుంబ పోషణ భారమైంది

2 నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నాము. కుటుంభ పోషణ భారంగా మారింది. అప్పులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాము. అధికారులు స్పదించి వేతనాలు ఇప్పించాలి.
– షేక్‌ ఫహీం, ఆస్పత్రి సిబ్బంది

చెల్లించేలా చర్యలు తీసుకుంటాం

జిల్లా ఆస్పత్రిలో వివిధ విభాగాల్లో పనిచేసే ఔట్‌ సోర్సింగ్‌ కార్మికులకు వేతనాలు 2 నెలలుగా చెల్లించనట్లు తమ దృష్టికి వచ్చింది. తక్షణమే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటాం. – శివశంకర్‌, బోధన్‌ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్‌

సమస్యలు పరిష్కరించేవరకు ఆందోళనలు చేస్తాం


మాక్లూర్‌ మండల కేంద్రంలో సమ్మె చేస్తున్న జేపీఎస్‌లు


రెంజల్‌: అంబేద్కర్‌ విగ్రహానికి వినతిపత్రం

రెంజల్‌/మాక్లూర్‌/బోధన్‌ రూరల్‌/మాక్లూర్‌/కమ్మర్‌పల్లి : తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని జూనియర్‌ పంచాయతీ కార్యదర్శులు(జేపీఎస్‌) స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా బుధవారం కూడా జేపీఎస్‌లు ఆందోళనలు నిర్వహించారు. కాలయాపన చేయకుండా ప్రభుత్వం స్పందిస్తే వెంటనే విధుల్లో చేరుతామన్నారు. ఆరు రోజులుగా సమ్మె చేస్తున్నా మా ధ్యాసంతా గ్రామ పంచాయతీలపైనే ఉందన్నారు. రెంజల్‌లో గాంధీ, అంబేద్కర్‌ విగ్రహాలకు వినతిపత్రాలు అందించారు. బోధన్‌లో జేపీఎస్‌ల సమ్మెకు అధికార పార్టీ సర్పంచులు మద్దతు తెలిపారు.


కమ్మర్‌పల్లిలో..


బోధన్‌లో సంఘీభావం తెలుపుతున్న అధికార పార్టీ సర్పంచులు

రైతుల కష్టం సర్కార్‌కు పట్టదు

- బీజేపీ నేత ఏలేటి మల్లికార్జున్‌ రెడ్డి

బాల్కొండ: అకాల వర్షాలతో అన్నదాతలకు జరుగుతున్న నష్టం, కష్టం రాష్ట్ర సర్కార్‌కు పట్టవని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మెండోరా మండలం సావెల్‌, వెల్కటూర్‌ గ్రామాల్లో పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ కాళ్ల మొక్కే సమయం ఉన్న మంత్రులకు రైతులను పరామర్శించే సమయం లేకపోవడం బాధాకరమన్నారు. ఆత్మీయ సమ్మేళనాల్లోనే బీఆర్‌ఎస్‌ నేతలు మునిగి తేలుతున్నారన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్‌, కిసాన్‌ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యంరెడ్డి, సాయారెడ్డి పాల్గొన్నారు.


సజ్జ పంటను పరిశీలిస్తున్న మల్లికార్జున్‌ రెడ్డి

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ..


కల్లెడిలో చెక్కులను అందజేస్తున్న వైస్‌ఎంపీపీ సుజాత


మామిడిపల్లిలో.. కౌన్సిలర్‌ ఆకుల రాము

పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని మామిడిపల్లి 24వ వార్డుకు చెందిన లబ్ధిదారులకు స్థానిక కౌన్సిలర్‌ ఆకుల రాము బుధవారం కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

కల్లెడిలో..

మాక్లూర్‌: కల్లెడిలో కల్యాణలక్ష్మి, షాదీ ముభారక్‌ చెక్కులను వైస్‌ ఎంపీపీ సుక్కి సుజాత సుధాకర్‌ పంపిణీ చేశారు. ఉప సర్పంచ్‌ మనీష్‌గౌడ్‌, వార్డు సభ్యులు సరిత, రాజు, రాంకిషన్‌లు పాల్గొన్నారు.

వీవోఏలకు గౌరవ వేతనం ఇవ్వాలి


ఆర్మూర్‌ టౌన్‌: అంబేద్కర్‌ చౌరస్తాలో నిరసన దీక్ష చేపడుతున్న వీవోఏలు

ఆర్మూర్‌టౌన్‌: వీవోఏలకు కనీస గౌరవ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సంఘం అధ్యక్షురాలు సువర్ణ అన్నారు. ఆర్మూర్‌ పట్టణంలోని అంబేద్కర్‌ చౌరస్తా వద్ద తమ డిమాండ్‌లను ప్రభుత్వం పరిష్కరించాలని వీవోఏలు నిరసన దీక్ష చేశారు.

బాల్కొండ నియోజకవర్గం పరిధిలో..

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్‌, మెండోరా మండల కేంద్రాల్లో సమ్మె బుధవారం నిర్వహించారు. ప్రభుత్వం స్పందించి వీవోఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.

రెంజల్‌లో..

రెంజల్‌(బోధన్‌): మండలంలోని వీవోఏలు సమ్మె బాట పట్టారు. బుధవారం మండలంలోని వీవోఏలు రెంజల్‌ చేరుకుని ఎంపీడీవో కార్యాలయం ముందు సమ్మెను ప్రారంభించారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు.

సీపీఎం మద్దతు

వర్ని: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్‌ చేస్తూ ఐకేపీ వీవోఏలు చేపట్టిన సమ్మెకు సీపీఎం వర్ని ఏరియా కార్యదర్శి నన్నేసాబ్‌ బుధవారం మద్దతు ప్రకటించారు. వీవోఏలు రూ.3,900 వేతనంతో కుటుంబాన్ని ఎలా పోషించుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.


రెంజల్‌ ఎంపీడీవో కార్యాలయం ఎదుట..

కమ్మర్‌పల్లిలో పదో రోజుకు చేరిన సమ్మె

కమ్మర్‌పల్లి: డిమాండ్ల సాధన కోసం ఐకేపీ వీవోఏలు చేపట్టిన సమ్మె కమ్మర్‌పల్లిలో పదో రోజుకు చేరుకుంది. బుధవారం మండల కేంద్రంలోని భగత్‌సింగ్‌ విగ్రహం వద్ద శిబిరం ఏర్పాటు చేశారు. తమ డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.

'హైవే విస్తరణ'పై గందరగోళం!

కమ్మర్‌పల్లి: మండలకేంద్రం పరిధిలో జాతీయ రహదారి విస్తరణ విషయమై గందరగోళం నెలకొంది. నాలుగు లేన్లుగా విస్తరణ చేయనుండటంతో గృహ, వ్యాపార సముదాయాలు పోతున్నాయి. దీంతో బాధితులు బైపాస్‌ నిర్మించాలని డిమాండ్‌ చేస్తూ, గ్రామ పంచాయతీ తీర్మానం కోసం బుధవారం జీపీ కార్యాలయానికి తరలివచ్చారు. వెంటనే బైపాస్‌ ప్రాంత రైతులు జీపీ కార్యాలయానికి వచ్చి బైపాస్‌ వద్దంటూ నినాదాలు చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ.. బైపాస్‌ రోడ్డు వల్ల విలువైన వ్యవసాయ భూములు కోల్పోవడమే కాక, జీవనాధారం కోల్పోతామన్నారు. రోడ్డు విస్తరణ బాధితులు మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణతో తమ వ్యాపారాలు రోడ్డున పడతాయన్నారు. కార్యదర్శి శాంతికుమార్‌ జోక్యం చేసుకొని ఇరువర్గాలను సముదాయించారు. తీర్మానం విషయంలో గాని, రోడ్డు విస్తరణకు సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు రాలేదని స్పష్టం చేశారు. ఒకవేళ వస్తే గ్రామసభ నిర్వహించి నిర్ణయం ప్రకారం తీర్మానం చేస్తామని వెల్లడించారు. అంతవరకు ఎటువంటి తీర్మానం గానీ, లేఖగానీ రాయవద్దని సర్పంచ్‌కు, కార్యదర్శికి చెప్పి రైతులు వెళ్లిపోయారు. రోడ్డు విస్తరణ బాధితులు అసంతృప్తితో బయటకు వచ్చి దుకాణాలను బంద్‌ చేసి స్థానిక పద్మశాలి కల్యాణమండపంలో సమావేశమయ్యారు.

క్లుప్తంగా

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్, ఖానాపూర్ గ్రామాల్లో గురువారం లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఇందూర్ సాయన్న, సింగిరెడ్డి మోహన్ చెక్కులను అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..



కమ్మర్‌పల్లి: బషీరాబాద్, నాగాపూర్ గ్రామాల్లోని బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీఆర్ఎస్ నాయకులు గురువారం పంపిణీ చేశారు. బాధితుల ఇళ్లకు వెళ్లి చెక్కులందించారు. కార్యక్రమంలో నేతలు బైకాని మహేశ్, బోడ దేవేందర్, మోహన్, రాజన్న, నరేందర్, రవికిరణ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



కమ్మర్‌పల్లి: బాల్కొండ నియోజకవర్గంలోని మానాల పరిధిలోని చింతామణి తండాకు చెందిన భూక్య గణేష్ ఇటీవల కరెంట్ షాక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆరెంజ్ ట్రావెల్స్ యజమాని ముత్యాల సునీల్‌రెడ్డి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేయగా, యువసేన సభ్యులు, గణేష్ భార్యకు గురువారం అందజేశారు.

హైదరాబాద్‌కు బస్సు నడపండి

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రం నుంచి హైదరాబాద్‌కు నేరుగా ఆర్టీసీ బస్సు నడపాలని మండల ప్రజలు కోరుతున్నారు. గతంలో ఇక్కడ నుంచి హైదరాబాద్‌కు బస్సు నడిచేదని కరోనా వల్ల రద్దు చేశారని గుర్తు చేశారు. అప్పటి నుంచి బస్సును పునరుద్ధరించలేదని మండల ప్రజలు తెలిపారు. ప్రయాణికుల కోరిక మేరకు వెంటనే ఉదయం వేళ నందిపేట్ నుంచి హైదరాబాద్ బయలుదేరేలా బస్సు డిపో మేనేజర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్మికుల శ్రేయస్సును విస్మరిస్తున్నాయి



నవీపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల శ్రేయస్సును విస్మరిస్తున్నాయని సీపీఐఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి రాజేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాంపూర్‌లో గురువారం మేడే వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ అమలును నిలిపివేయాలన్నారు. వేతనాల పెంపు జీవోను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నాయకులు నాగన్న, నజీర్, సాయిలు పాల్గొన్నారు.

'కార్పొరేట్'కు అనుకూలంగా చట్టాలు



బాల్కొండ: దేశంలోని మోదీ సర్కార్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కార్మిక చట్టాలను చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ ఆరోపించారు. గురువారం బాల్కొండ మండల కేంద్రంలో బీజేపీ హఠావో.. దేశ్‌కి బచావో నినాదాంతో జీపు జాతను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తొమ్మిదేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ నల్లధనం బయటికి తీయలేదన్నారు. కేవలం అదానీ, అంబానీలకు లాభం చేకూర్చే చట్టాలను చేస్తుందని విమర్శించారు. జిల్లా కార్యదర్శి సుధాకర్, డివిజన్ అధ్యక్షుడు ఆరేపల్లి సాయిలు పాల్గొన్నారు.

లింబాద్రి గుట్టను దర్శించుకున్న ఆకుల లలిత

భీమ్‌గల్: పట్టణంలోని లింబాద్రి గుట్టని తెలంగాణ రాష్ట్ర మహిళా సంక్షేమ బోర్డు చైర్‌పర్సన్ ఆకుల లలిత గురువారం దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు పార్థసారథి ఆమెకు స్వాగతం పలికారు. ఆలయంలో ఆమె ప్రత్యేక పూజలు చేశారు.

వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్లలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందాంబల కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా కల్యాణోత్సవం, పూజలు, అన్నదానం ఉంటుందన్నారు.

నువ్వుల రైతుకు నవ్వు దూరం!

- అకాల వర్షంతో పంటకు తీవ్ర నష్టం
- కోత కోసి ఆరబెట్టిన రైతుల పరిస్థితి అధ్వానం
- ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్



నాగంపేట్‌లో తడిసిన నువ్వుల పంటను ఆరబెడుతున్న రైతులు

బాల్కొండ: అకాల వర్షాలతో నువ్వులు సాగు చేసిన రైతుల మోముల్లో నవ్వు దూరమైంది. సజ్జ పంట వ్యాపారుల సిండికేట్‌కు చెక్ పెట్టాలని రైతులు ప్రత్యామ్నాయంగా నువ్వుల పంటను అధికంగా సాగు చేశారు. కాని 10 రోజుల నుంచి నిత్యం వర్షాలు కురవడంతో నువ్వుల పంట చేతికందకుండా పోయింది. నువ్వు నూనె గింజ కావడంతో అధికంగా తేమ ఉంటుంది. దానికి తోడు వర్షం కురవడంతో తడిసివెంటనే నువ్వు విత్తనాలు రంగు మారుతున్నాయి. నువ్వు కాయ ఆరకపోవడంతో విత్తులు రాక రైతులు అలానే వదిలేస్తున్నారు. నువ్వు పంటను కోత కోసి, ఆరబెట్టిన తర్వాత నువ్వు విత్తులను తీస్తారు. కాని ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఎండలు రాకపోడంతో ఎండడం లేదు. దీంతో కాయలోనే విత్తు ముక్కి పోతోంది. నువ్వుల పంట ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు అంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రెండు నుంచి మూడు క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం లేదంటున్నారు. వచ్చిన వాటిని కొనుగోలు చేసే వ్యాపారులు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నువ్వుల అ'ధర'హో..

ప్రస్తుత సంవత్సరం నువ్వుల పంటకు క్వింటాలుకు రూ.14 వేలు పలుకుతోంది. కాని ప్రకృతి కన్నెర్ర చేయడం వల్ల రైతుల వద్ద నువ్వులు లేకుండాపోతున్నాయి. ప్రస్తుత సంవత్సరం నువ్వుకు మంచి ధర పలుకుతుందని ఆశపడిన రైతులకు నిరాశే మిగులుతోంది. పూజారి కరుణించినా దేవుడు వరమివ్వలేదనన్నట్లుగా మారింది.

నష్టం అపారం..

మోర్తాడ్(బాల్కొండ): మోర్తాడ్‌కు చెందిన రైతు కనకం అనిల్ రెండు ఎకరాల్లో నువ్వుల పంటను సాగు చేశాడు. ఒక ఎకరం విస్తీర్ణంలో పంటను కోయగా మరో ఎకరం పొలంలోని నువ్వును కోయడానికి కొంత సమయం తీసుకున్నాడు. అంతలోనే అకాల వర్షం నువ్వుల పంటను మింగేసింది. ఎకరం విస్తీర్ణంలో దిగుబడి కనీసం ఐదు క్వింటాళ్లు వస్తుందని రైతు ఆశించగా పంట మొత్తం నీటిపాలు కావడంతో సదరు రైతుకు రూ.70వేల వరకు ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. అనిల్ నువ్వుల సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా చేతికి అందకుండా పోయింది. ఇది ఒక్క రైతు అనిల్‌కు ఎదురైన కష్టమే కాదు.



నువ్వుల పంటను సాగు చేసిన ఎంతో మంది రైతులు అకాల వర్షాలతో పంటను కోల్పోయి తీవ్ర నష్టాన్ని మూటగట్టుకున్నారు. జిల్లాలో సుమారు రెండు వేల ఎకరాల్లోనిపంటకు నష్టం ఏర్పడినట్లు అంచనా. జిల్లాలోని రైతాంగానికి రూ.14 కోట్లకు మించి ఆదాయం కోల్పోయినట్లైందని అంచనాల్లో తేలింది.

ధర ఉన్నా వానలే దెబ్బతీశాయి

అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి. వడగండ్ల వానల వల్ల వరి, నువ్వు, సజ్జ రైతులు అధికంగా నష్టపోయారు. నువ్వులకు ప్రస్తుతం ధర మంచిగా ఉంది. కానీ వానలకు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం స్పందించి అన్నదాతలను ఆదుకోవాలి. -బుల్లెట్ రాంరెడ్డి, తెలంగాణ ఉద్యమ సమితి రైతు విభాగం నేత

రైతులను కాపాడే బాధ్యత కేసీఆర్‌దే

- అన్నదాతలకు ఎకరానికి రూ.25 వేల నష్ట పరిహారం చెల్లించాలి
- మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి



మందర్నలో వరిని పరిశీలిస్తున్న సుదర్శన్‌రెడ్డి

బోధన్/రెంజల్: అకాల వర్షాల కారణంగా వరి ధాన్యం తడిసిపోయి, మొలకెత్తి తీవ్ర నష్టాలకు గురైన అన్నదాతలను కాపాడే బాధ్యత సీఎం కేసీఆర్‌దేనని టీపీసీసీ కోశాధికారి, మాజీ మంత్రి పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎకరానికి రూ.25 వేల నష్ట పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తడిసిన, మొలకెత్తిన వరి ధాన్యం తీసుకునే విషయంలో బాయిల్డ్ రైస్‌మిల్లర్లు రైతులకు సహకరించాలన్నారు. గురువారం సాలూరు మండలంలోని సాలూర క్యాంప్, సాలూర, హున్స, మందర్న గ్రామాల్లో, రెంజల్ మండలంలోని దూపల్లి, వీరన్నగుట్ట, రెంజల్, సాటాపూర్ గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. రైతుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని హార్వెస్టర్ యజమానులు గతంలో తీసుకున్న ధరకే వరి కోతలు కోసేందుకు సహకరించాలన్నారు. అధికారులు పంట నష్టాన్ని సర్వే చేసి నివేదికలను ప్రభుత్వానికి పంపించి రైతులకు పరిహారం అందేలా చూడాలన్నారు. ఖాజాపూర్, హున్సా, మందర్న గ్రామాల్లో సన్‌ఫ్లవర్ దిగుబడులు రైతుల వద్ద ఉన్నాయని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సేకరించాలని ఫోన్‌లో మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ మార గంగారెడ్డిని కోరారు. తానే తడిసిన వరి ధాన్యం కొనుగోలు చేస్తానని ఎమ్మెల్యే షకీల్ ఇచ్చిన హామీ మేరకు ఆయన రైస్‌మిల్లుకు ధాన్యం తీసుకెళ్లగా తిరస్కరించారని రైతులు చెబుతున్నారని పేర్కొన్నారు. నేతలు పాషా మోహినొద్దీన్, పులి శ్రీనివాస్, అల్లె రమేష్, దొడ్ల రవీందర్‌రెడ్డి, దాము, మందర్న రవి, నాగేశ్వర్‌రావు చిద్రపు అశోక్, చీల శంకర్, నరేందర్‌రెడ్డి , రెంజల్ మాజీ ఎంపీపీ మొబిన్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

అధిక కిరాయి వసూలుపై చర్యలు తీసుకోవాలి

నవీపేట: లారీలు, వరికోత యంత్రాల యజమానులు రైతుల నుంచి ఇష్టానుసారం కిరాయి వసూలు చేస్తున్నారని మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నవీపేటతో పాటు మండలంలోని అభంగపట్నంలో ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యం రాశులను పరిశీలించి మాట్లాడారు. అధికారులు నిర్ణయించిన రేట్లకంటే అధికంగా లారీల యజమానులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఎం నేత వెంకటేష్

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇవ్వాలని సీపీఎం ఆర్మూర్ ఏరియా కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆర్మూర్ డివిజన్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇల్లు లేని వారందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలన్నారు. వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. పట్టణ కార్యదర్శి కూత డెల్లయ్య, ఏరియా కమిటీ సభ్యులు విడగొట్టి సాయిలు, తోకట్టి భూమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న సీపీఐ నేత విఠల్ గౌడ్

సభను విజయవంతం చేయాలి

రుద్రూర్: సీపీఐ ఆధ్వర్యంలో 6న జరగనున్న బహిరంగసభను కార్మిక సంఘాల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ కోరారు. గురువారం కోటగిరి మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఇంటింటా సీపీఐ కార్యక్రమంలో భాగంగా నెలరోజులుగా కొనసాగుతున్న ఇంటింటా సీపీఐ, బీజేపీ హఠావో దేశ్‌కు బచావో కార్యక్రమంలో భాగంగా కోటగిరిలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే సభకు నేతలు పద్మ, సుధాకర్ హాజరవుతారని చెప్పారు.

దౌర్జన్యానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్: తన ఇంటి స్థలానికి ఏర్పాటు చేసుకున్న ప్రీకాస్టును దౌర్జన్యంగా కూల్చి వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్మూర్ పట్టణానికి చెంది గుండి గంగాచరణ్ అధికారులను కోరాడు. ఆర్మూర్ పట్టణంలో గురువారం బాధితుడు మాట్లాడుతూ.. పట్టణంలోని ఖాజన్న గైని కాలనీలో 230, 233 సర్వే నెంబరులో 200 గజాల స్థలాన్ని 2019లో ఇతరుల నుంచి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. కాగా పెద్ద మనుషులుగా చలామణి అవుతున్న కొందరు తన స్థలం చెరువుకు సంబంధించిందని, తాను హద్దులతో ఏర్పాటు చేసుకున్న ప్రీకాస్టును మూడు రోజుల క్రితం దౌర్జన్యంగా ధ్వంసం చేశారని తెలిపారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా బాధితుడు కోరాడు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



రుద్రూర్: మోస్రా మండలంలోని చింతకుంట గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ గుత్ప విజయభాస్కర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో చింతకుంట సర్పంచ్ విజయ, నాయకుడు సాయ గౌడ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె

జిల్లా వ్యాప్తంగా వీవోఏల సమ్మె గురువారం కొనసాగింది. కనీస వేతనం రూ.18 వేలను డీఆర్‌డీఏ అకౌంట్ నుంచి నేరుగా వీవోఏల అకౌంట్‌లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పిస్తూ ప్రతీ ఒక్కరికి రూ.10 లక్షల సాధారణ బీమా, ఆరోగ్య బీమా కల్పించాలని కోరారు. ఆర్మూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్



ఆర్మూర్‌టౌన్: అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న వీవోఏలు



కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న ప్రజాపంథా నేత సురేశ్



వేల్పూర్‌లో సమ్మె చేస్తున్న వీవోఏలు



రెంజల్‌లో..



మాక్లూర్ మండల కేంద్రంలో ..

ఊట్‌పల్లి బాధిత కుటుంబాలకు పరామర్శ



బోధన్‌రూరల్(బోధన్): నిజామాబాద్‌లోని అర్సపల్లి బైపాస్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఊట్‌పల్లి గ్రామానికి చెందిన నాలుగు బాధిత కుటుంబాలను బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సతీమణి అయేషా ఫాతిమా, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డిలు పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు.

బీజేపీ నాయకుల సానుభూతి

ఊట్‌పల్లిలో మృతుల కుటుంబాలను బీజేపీ నియోజకవర్గ నాయకులు మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డి, మండలాధ్యక్షులు మోస్రా పోశెట్టిలు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కాసింత మొరం వేయండి సారూ..



గాడ్స్ కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

బోధన్‌టౌన్(బోధన్): రాకాసీపేట్ శివారు గాడ్స్ కాలనీలో రోడ్లపై కాసింత మొరం వేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలనీ రోడ్లు బురదమయంగా మారాయని, మరికొన్ని రోడ్లపై వర్షపు నీరు నిలిచి అడుగు వేయలేని స్థితిలో ఉన్నాయని, బల్దియా అధికారులు స్పందించి మొరం వేసి కాలనీ ప్రజల అవస్థలు తీర్చాలని కోరుతున్నారు. ప్రతీ వర్షాకాలంలో పరిస్థితి ఇలాగే ఉంటుందని, పలు మార్లు బల్దియా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని కాలనీ వాసులు వాపోయారు.

క్రమబద్ధీకరించే వరకు సమ్మె కొనసాగిస్తాం



నిరసన చేపడుతున్న జేపీఎస్‌లు

ఆర్మూర్‌టౌన్: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగాలను ప్రభుత్వం రెగ్యులర్ చేసే వరకు సమ్మె కొనసాగిస్తామని జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు సోంగ అనిల్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని అంబేడ్కర్‌చౌరస్తా వద్ద గురువారం డివిజన్ పరిధిలోని జేపీఎస్‌లు పాల్గొని నిరసన దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జేపీఎస్‌లను రెగ్యులర్ చేస్తూ 4 సంవత్సరాల ప్రొబేషనరీ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలన్నారు. ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా రెగ్యులర్ చేయాలన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సాయి కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా లక్ష్మీ నర్సింహ స్వామి జయంతి



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని గోల్‌బంగ్లా వద్ద గల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వామివారి జయంతి వేడుకలను సర్వసమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్వసమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, ప్రధాన కార్యదర్శి కర్తన్ దినేష్, భక్తులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణ మహోత్సవం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని బసవతారకనగర్ కాలనీలోని కోట మైసమ్మ సహిత లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం, జయంతులను కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమానికి నందిపేట్ కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్, మల్లారం గుట్ట పీఠాధిపతి పిట్ల కృష్ణ మహారాజ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పసుపులేటి గోపికిషన్, భీంరావ్, సుధాకర్, రాజు, గంగాధర్, భక్తులు పాల్గొన్నారు.

చిక్లీలో..



మాక్లూర్: చిక్లీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో, బోర్గాం(కె)లో గురువారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా విగ్రహ మూర్తులను గంగాజలంతో శుభ్రం చేశారు. పట్టు వస్త్రాలతో అలంకరించి పల్లకిలో ఊరేగించారు. ఆలయ పూజారి కృష్ణబాబు శర్మ సాంప్రదాయబద్ధంగా స్వామివారి కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉపసర్పంచ్ గుండు రవి, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో..



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో లక్ష్మీనృసింహ స్వామి జయంతిని పురస్కరించుకొని స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీనృసింహ స్వామి దేవాలయంలో పురోహితులు శివకుమార్ కల్యాణోత్సవాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

అపూర్వ సమ్మేళనం

మాక్లూర్: మండలంలోని మదన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006 – 07లో పదో తరగతి చదివిన విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ఆనాటి విద్యార్థులతోపాటు, గురువులు నరేష్, మాణిక్యం, గణేష్‌ప్రసాద్ శర్మ, నాగేంద్రమణి, జానబాయ్, దేవేందర్, లచ్చన్న హాజరైయ్యారు. ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు అలనాటి మిత్రులను పలుకరించుకొని, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.



అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న బీజేపీ నేత మల్లికార్జున్‌రెడ్డి

బాల్కొండ: మెండోరా మండలం సావెల్‌లో మరుగు దొడ్ల నిర్మాణాల్లో అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ నాయకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సావెల్‌లో ఆయన మాట్లాడారు. గ్రామంలో స్వచ్ఛ మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం 252 మరుగు దొడ్లకు నిధులను మంజూరు చేసిందన్నారు. అందులో 108 మాత్రమే నిర్మించి, మిగతా వాటిని నిర్మించకుండానే స్థానిక బీఆర్ఎస్ నాయకులు నిధులను కాజేశారన్నారు. విషయంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి విచారించినా మంత్రి ప్రశాంత్‌రెడ్డి నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం శోచనీయమన్నారు. మంత్రి అండతోనే బీఆర్ఎస్ నాయకులు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. నాయకులు నిమ్మల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సాయారెడ్డి, బుస్సాపూర్ ఎంపీటీసీ సాయన్న పాల్గొన్నారు.